అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక



- కాజీపేట మండల రెవెన్యూ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం నవ్వులపాలు
- భూముల రిజిస్ట్రేషన్ల వివరాలు వెల్లడించేందుకు అధికారుల విముఖత
- ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి భూముల రిజిస్ట్రేషన్ల వివరాలు కోరిన ఆర్జిదారు
- డాక్యుమెంట్ పత్రులు తమ కార్యాలయంలో లేవని వెల్లడించిన వైనం
- డిప్యూటీ తహసీల్దార్ సమాధానంపై వెల్లువెత్తుతున్న విమర్శలు
- జిరాక్స్ ప్రతులు, రిజిస్టర్ కార్యాలయంలో ఉండవా అంటూ ప్రశ్నలు
- చట్టాన్ని ఉల్లంఘించడమే అంటున్న నిపుణులు
- ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదుచేసిన ఆర్జిదారు
- అధికారులపై చర్యలు కోరుతూ కోర్టుకు వెళ్లేందుకు సిద్ధం

# ఇంత నిర్లక్ష్యమా..?

**అక్షర దర్బార్, ప్రత్యేక ప్రతినిధి :**

పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంతోపాటు ప్రజలకు ప్రశ్నించేతత్వాన్ని నేర్పిన సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ)కి కొందరు అధికారులు తూట్లు పొడుస్తున్నారు. కోరిన సమాచారం ఇవ్వకుండా కొర్రీలు పెడుతూ నిబంధనలు భేఖాతర్ చేస్తూ స.హ.చట్టాన్ని నీరుగార్చుతున్నారు. దీంతో సామాన్యుడికి ప్రభుత్వ కార్యాలయాల నుంచి సమాచారం అందడం గగనంగా మారుతోంది. తాజాగా ఇలాంటి ఘటనే హన్మకొండ జిల్లా కాజీపేట మండల తహసీల్దార్ కార్యాలయంలో వెలుగుచూసింది. ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి 2024 ఆగస్టు 31వ తేదీ వరకు కాజీపేట మండల తహసీల్ కార్యాలయంలో జరిగిన భూముల రిజిస్ట్రేషన్ల వివరాలు కావాలని కోరిన దరఖాస్తుదారుడు అధికారులు ఇచ్చిన సమాచారంతో అవాక్కయ్యాడు. ఆర్జిదారుడు కోరిన డాక్యుమెంట్ పత్రులు తమ కార్యాలయంలో లేవని డిప్యూటీ తహసీల్దార్ సమాచారం ఇవ్వడం సమాచార హక్కు చట్టాన్ని నవ్వులపాలు చేస్తోంది. అంతేగాక పౌర సమాచార అధికారి హోదాలో సదరు అధికారి ఇచ్చిన సమాధానం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఈక్రమంలోనే డీటీ సమాధానంతో సంతృప్తి చెందని ఆర్జిదారుడు నేరుగా జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) ఆఫీస్‌లో దరఖాస్తు అందించి సమాచారం కోరాడు. ఒక్క కాజీపేట నుంచేగాక ఖిలా వరంగల్, హసన్‌పర్తి మండల కార్యాలయాల్లోని అధికారుల నుంచీ ధరణిపై సమాచారం కోరిన ఆర్జిదారులకు ఇలాంటి సమాధానమే వస్తుండటం గమనార్హం.

**- దాపరికం ఎందుకో..?**

భూముల రిజిస్ట్రేషన్లు, మ్యూటేషన్లు, ఆస్తుల బదిలీలకు జవాబుదారీతనం, సురక్షితమైన, ఇబ్బంది లేకుండా ప్రజలకు సేవలు అందించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2020లో ధరణి పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. విక్రయదారులు, కొనుగోలుదారులు ముందుగా మీసేవలో సంప్రదించి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకొని స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. పాస్‌బుక్ స్కాన్ చేయడంతో పాటు ఇరువురి తంబ్‌లు తీసుకున్నాక డబ్బు కట్టాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జరిగే విధంగానే తంతు మొత్తం మీసేవ కేంద్రంలోనే జరిగిపోతుంది. ఆ తర్వాత స్లాట్ ప్రకారం.. విక్రయదారులు, కొనుగోలుదారులు ఇద్దరితోపాటు మరో ఇద్దరు సాక్షులు సంబంధిత మండల రెవెన్యూ అధికారి కార్యాలయంలో సంప్రదించగా అక్కడ సంబంధిత పత్రాలపై తహసీల్దార్ డిజిటల్ సైన్‌తో ప్రక్రియ పూర్తవుతుంది. ఆ వెంటనే ఒరిజినల్ పత్రాలు బాధ్యులకు అందించి వాటి జిరాక్స్ ప్రతులను తహసీల్ కార్యాలయంలో భద్రపరుస్తారు. అంతేగాక ఇందుకోసం ప్రత్యేకంగా రిజిస్టర్ కూడా నిర్వహిస్తారు. ఈక్రమంలోనే ధరణి రిజిస్ట్రేషన్లపై సమాచారం కోరిన ఆర్జిదారుడికి సదరు తహసీల్దార్ సమాచారం అందించడం కష్టమైన పనికాదు. ఓపక్క రిజిస్ట్రేషన్లకు సంబంధించిన జిరాక్స్ ప్రతులు, మరోపక్క రికార్డులు ఉన్నప్పటికీ ఆర్జిదారుకు తమవద్ద ఎలాంటి సమాచారం అందుబాటులో లేదని డిప్యూటీ తహసీల్దార్ సమాధానం ఇవ్వడంపై అనేక అనుమానాలు కలుగుతున్నాయి. అంతేగాక డీటీ సమాధానం పూర్తిగా చట్టాన్ని ఉల్లంఘించడమేనని నిపుణులు చెబుతున్నారు. సరైన సమాధానం రానిపక్షంలో ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్జిదారుడు కోర్టును ఆశ్రయించొచ్చని అంటున్నారు.

## శిక్షకు అర్హులే. ..

**- రాచకొండ ప్రవీణ్ కుమార్ న్యాయవాది, వరంగల్**



సమాచార హక్కు చట్టం-2005 సెక్షన్ 2 (f),(i),(j) ప్రకారం సమాచారం ఏ రూపంలో ఉన్నా, అవి రికార్డ్స్, డాక్యుమెంట్స్, మెమోస్, ఈమెయిల్, ఒపీనియన్స్, సలహాలు, సర్క్యులర్స్, ఆర్డర్స్, పేపర్స్, శాంపిల్స్, రిపోర్ట్స్, ఎలక్ట్రానిక్ సమాచారం, స్వయంగా వెళ్లి డాక్యుమెంట్ల ను, రికార్డులను సమాచార నిమిత్తం చూడవచ్చు. సెక్షన్ 6 ప్రకారం సమాచారం కోరవచ్చు, దానికి ఆర్టీఐ చట్టం రూల్స్ 2012, రూల్ 3 ప్రకారం 10 రూపాయల ఫీజ్ కట్టి తగు సమాచారం పొందవచ్చు. ఒకవేళ సమాచారం ఉండి దురుద్దేశంతో ఇవ్వకపోవటం లేదా తిరస్కరిస్తే, చట్ట ప్రకారం సంబందిత అధికారులు శిక్షకు అర్హులే. సమాచార హక్కు చట్టాన్ని తీసుకురావడానికి ముఖ్య కారణం ప్రభుత్వ కార్య కలాపాలకు సంబంధించి పౌరులకు పారదర్శకతను అందించడం. అలాగే సుస్థిర ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పడం. చట్టానికి ఎవరూ మినహాయింపు కాదని అధికారులు గుర్తుంచుకోవాలి.

---

# కాటమయ్య కిట్ ను సద్వినియోగం చేసుకోవాలి

**ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి**

అక్షర దర్బార్, నర్సంపేట : కాటమయ్య రక్షణ కవచాన్ని గీత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలో 199 మంది గీత కార్మికులకు కాటమయ్య కిట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ప్రమాదవశాత్తు గాయపడిన కార్మికులకు రూ. 25వేలు ఇచ్చే విధంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం నర్సంపేట మండలంలోని 34 మంది గీత కార్మికులకు, చెన్నారావుపేట మండలంలో 24 మందికి, దుగ్గొండి మండలంలో 31 మందికి, ఖానాపురం మండలంలో 37 మందికి, నల్లబెల్లి మండలంలో 33 మందికి, నెక్కొండ మండలంలో 40 మంది గీత కార్మికులకు కాటమయ్య కిట్లను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి పుష్పలత, ఎక్సైజ్ డీఎస్పీ మురళీధర్, సీఐ నరేష్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్, కౌన్సిలర్లు బత్తిని రాజేందర్, ఎలకంటి విజయ్ కుమార్, మోకు దెబ్బ రాష్ట్ర నాయకులు అనంతుల రమేష్, గోపా డివిజన్ అధ్యక్షుడు సుధాకర్ పాల్గొన్నారు.



కాటమయ్య కిట్టును అందజేస్తున్న ఎమ్మెల్యే దొంతి

# మహిషాసురమర్దినిగా అమ్మవారు దర్శనం..



అక్షర దర్బార్, పరకాల : పరకాల పట్టణంలోని కనకదుర్గమ్మ, మదన పోచమ్మ ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 9వ రోజు మహిషాసురమర్దిని అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు బండి సారంగపాణి, దేవునూరి మేఘనాథ్, గందే వెంకటేశ్వర్లు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగెల్లి రంజిత్, ఇంగిలి వీరేష్ రావు, మూసినిపల్లి శివ ప్రసాద్, పచ్చిక శంతన్ రెడ్డి,కంచం రవితేజ,సత్యం, పింటు,దాసరి సాయి, మార్త రాజేంద్ర ప్రసాద్,రాకేష్, మధు, వరప్రసాద్, శివప్రసాద్, మనోహర్, పప్పులు, మనోహర్, చిన్న, రామ్ చరణ్, సిద్దు, తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి నాగూర్ల పరామర్శ..



అక్షర దర్బార్ ఆత్మకూర్ : మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ లకిడే శివాజీ సోదరుడు లకిడి మల్లాజీ అకాల మరణం చెందగా శుక్రవారం మృతుడి కుటుంబ సభ్యులను తెలంగాణ రాష్ట్ర రైతుల విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు పరామర్శించారు. ఆయనవెంట జెండా రాజేష్,కౌడగానినర్సింగరావు,హింగే శివాజీ,వజ్ర కిషన్ రావు, సిరిసే చందర్ రావు,గువ్వడి సాంబయ్య,మాజీ సర్పంచ్ శావూరే రాజేశ్వర్ రావు,రాజేష్, హరీష్,కమలాపురం రమేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.